నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, ఆదివారం 29 డిసెంబర్ 2024 | RAJANNA SIRCILLA

చలానా తీసుకుంటున్నం అంతే

నిబంధనల ప్రకారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, ఇతర వాహనాలను పట్టుకొని పోలీసులు మాకు అప్పగించాలి. సదరు ట్రాక్టర్ యజమాని మొదటి సారి దందా చేస్తున్నారా..? లేక రెండోసారి దందా చేస్తున్నారా..? ఎన్నిసార్లు పట్టుబడ్డారు? అని చూసి జరిమానా విధిస్తాం. సదరు ఇసుకను వేలం వేయాలి. ప్రస్తుతం జమ్మికుంటలో అలా చేయడం లేదు. కోర్టుకు రాస్తున్నారు. కోర్టు మాకు ఆర్డర్ కాపీ పంపిస్తున్నది. వచ్చినోళ్లు ₹5వేల చలానా తెస్తున్నారు. రిలీజ్ ఆర్డర్ పట్టుకుపోతున్నారు. అంతా పేపర్ మీదే జరుగుతున్నది. ట్రాక్టర్ ఇక్కడికి రాదు. ఇసుక డంప్ ఉండదు. వేలం వేసేది లేదు. చలానైతే వస్తుంది అంతే.

- రమేశ్‌బాబు, జమ్మికుంట తహసీల్దార్



పట్టుకున్న ఇసుక మాయం?

జమ్మికుంట కేంద్రంగా మాయాజాలం

- పట్టుకున్న ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించని పోలీసులు
- ఇసుక డంపులేదు.. వేలం అసలే లేదు
- కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తున్న ఘనులు?
- బాగోతం నడుపుతున్నది పోలీసులా..? రెవెన్యూ అధికారులా..?
- అడిగేందుకు భయపడుతున్న రెవెన్యూ అధికారులు
- దానిని అనువుగా మల్చుకుంటున్న ఖాకీలు
- 90కిపైగా ట్రాక్టర్లు సీజ్ అయినట్టు రికార్డులు
- ఆ ఇసుకంతా ఏమైందనే ప్రశ్నలు
- విచారణ జరిపితే బయటపడనున్న దందా

సాధారణంగా ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న అనంతరం వాటిని సంబంధిత తహసీల్ ఆఫీస్‌కు అప్పగిస్తారు. అక్కడ రెవెన్యూ అధికారులు జరిమానా విధించి, ఇసుక డంప్ చేసుకుంటారు. ఆ ఇసుకకు వేలం వేసి, వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమచేస్తారు. ఇది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రక్రియ. కానీ, జమ్మికుంటలో దీనిని పూర్తిగా మార్చి వేశారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయగానే సదరు యజమానులు కోర్టును ఆశ్రయించి రిలీజ్ ఆర్డర్ తెచ్చుకోవడంతో పోలీసులు విడుదల చేస్తున్నారు. కానీ, అదే ఆర్డర్‌లో ఉన్న కోర్టు ఆదేశాలను మాత్రం విస్మరిస్తున్నారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌లోని ఇసుకను తహసీల్దార్ స్వాధీనం చేసుకొని వేలం వేసి, వచ్చిన ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి జమచేసి, సదరు చలానాను కోర్టుకు సమర్పించాలని స్పష్టంగా రిలీజ్ ఆర్డర్‌లో ఉన్నా.. దానిని పట్టించుకునే వారు కరువయ్యారు. నిశితంగా పరిశీలిస్తే.. సీజ్ చేసిన ట్రాక్టర్లు తహసీల్దార్ కార్యాలయానికే రాకపోగా, అందులోని ఇసుకంతా మధ్యలోనే మాయమవుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే జమ్మికుంట కేంద్రంగా ఇసుక మాయజాలం జరుగుతున్నది. అయితే ఈ బాగోతంలో సూత్రదారులెవరు? పాత్రదారులెవరు? ప్రభుత్వానికి జరుగుతున్న నష్టమెంత? కోర్టు ఆదేశాలను పాటించకుండా ఈ తతంగం నడుపుతున్నది పోలీసులా..? రెవెన్యూ అధికారులా..? దీని వెనుక జరుగుతున్న బాగోతం ఏంటి? అన్నది తేలాలంటే.. లోతుగా విచారణ చేయాలన్న డిమాండ్ వస్తున్నది.

కరీంనగర్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / జమ్మికుంట : జమ్మికుంట కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా చాలాకాలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. మండలంలోని విలాసాగర్, తనుగుల, గండ్రపల్లి గ్రామాల సమీపంలో మానేరు నదీ పరీవాహకం నుంచి తరలుతుండడం విదితమే. అక్రమార్కులు మానేరు నుంచి అక్రమంగా తరలించడం, ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకోవడం, పోలీసులు సీజ్ చేయడం, ఆ తర్వాత దందా మళ్లీ యథావిధిగా కొనసాగడం అంతా ఎప్పుడూ జరుగుతున్నదే. ఈ దందా లాభదాయకంగా ఉండడంతో చాలా మంది ఒకరిని చూసి, మరొకరు ట్రాక్టర్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. పలు గ్రామాల నుంచి వందలాది ట్రాక్టర్లు ఇసుక అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంటాయని సమాచారం కాగా, పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, తదితర శాఖల అధికారులు సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు పట్టుకోవడం, మళ్లీ విడిచిపెట్టడం ఇక్కడ అత్యంత సాధారణంగా జరుగుతున్నదనే విమర్శలున్నాయి. అందుకే అక్రమార్కులు తమ దందాను విడిచిపెట్టడం లేదు. దీనిని నిరంతరం కొనసాగించేందుకు ఇష్టపడుతున్నారని చెప్పడానికి ఆయా గ్రామాల్లో తరుచుగా జరిగే సంఘటనలే నిదర్శనం.

సరికొత్త దందాకు శ్రీకారం

ఇసుక అక్రమ దందాను అరికట్టేందుకు కొన్ని నెలల క్రితం పోలీసులు ఉక్కుపాదం మోపింది వాస్తవమే. ఒక దశలో వందలాది ట్రాక్టర్లను సీజ్ చేయడమే కాదు, అక్రమ రవాణా చేయాలంటేనే భయపడే పరిస్థితిని కల్పించింది నిజమే. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదుగానీ, అక్రమ రవాణా మాత్రం మళ్లీ యథేచ్ఛగా సాగుతున్నది. ఇటీవలి కాలంలో పోలీసులు దాదాపు 90 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. అయితే సాధారణంగా పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి, ఆ తర్వాత సంబంధిత తహసీల్ కార్యాలయానికి అప్పగిస్తారు. వారు జరిమానా వేసి, ఇసుకను స్వాధీనం చేసుకుంటారు. అలా డంప్‌చేసిన ఇసుకను వేలం వేస్తారు. అందుకోసం పేపర్ ద్వారా ప్రకటన జారీ చేస్తారు. ఇసుకను అమ్మగా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు. ఇదంతా ఒక ప్రొసిజర్. కానీ, జమ్మికుంటలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లను ఠాణా సమీపంలోని

రైల్వే స్టేషన్ ఆవరణలో పెడుతున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో పోలీసులు కోర్టుకు పంపడానికి అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఆ మేరకు కోర్టుకు వెళ్లిన సదరు ట్రాక్టర్ యజమానులు, కోర్టు నిబంధనల ప్రకారం పూచీకత్తు ఇచ్చి రిలీజ్ ఆర్డర్‌ను తెచ్చుకుంటున్నారు. దీంతో పోలీసులు సదరు ట్రాక్టర్లను విడిచిపెడుతున్నారు. ఇక్కడి వరకు నిబంధనలను పాటిస్తున్నా, ఆ తర్వాతే అసలు ట్విస్ట్ మొదలవుతున్నది. కోర్టు రిలీజ్ ఆర్డర్‌లోనే మరో స్పష్టమైన ఆదేశాన్ని ఇస్తున్నది. రిలీజ్ ట్రాక్టర్‌కు సంబంధించిన ఇసుకను వేలం వేసి, విక్రయించిన మొత్తాన్ని చలానా ద్వారా ప్రభుత్వానికి జమచేయాలని, సదరు చలాన్ కాపీని కోర్టుకు సమర్పించాలని అదే ఆర్డర్‌లో తహసీల్దార్‌ను స్పష్టంగా ఆదేశిస్తున్నది.

కోర్టు ఆదేశాల ఉల్లంఘన?

రిలీజ్ ఆర్డర్‌లోనే కోర్టు తహసీల్దార్‌కు స్పష్టంగా ఆదేశాలిస్తున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. తాజాగా అందుతున్న సమచారాన్ని బట్టి చూస్తే.. సీజ్ చేసిన దాదాపు 90 ట్రాక్టర్లకు సంబంధించి రిలీజ్ ఆర్డర్లు కోర్టు నుంచి వచ్చినట్టు తెలుస్తున్నది. ఆ మేరకు సదరు ట్రాక్టర్లను పోలీసులు వదలి పెట్టారు. కానీ, అందులోని ఏ ఒక్క ట్రాక్టర్ తహసీల్ ఆఫీస్‌కు వెళ్లలేదు. ఇసుక అన్‌లోడ్ చేయలేదు. అధికారికంగా వేలం వేయలేదు. కానీ, ₹ఐదు వేల చలానాను సీజ్ చేసిన ట్రాక్టర్‌దారులు తీసుకొచ్చి, రెవెన్యూ కార్యాలయంలో అప్పగించి దర్జాగా వెళ్తున్నారు. అసలు ఆ ₹5వేలు ఎవరూ నిర్ధారిస్తున్నారు? అంతే మొత్తంలో ప్రతి ట్రాక్టర్ చలానా ఎందుకు కడుతున్నారు? కోర్టు రీలీజ్ ఆర్డర్‌లో చెప్పినట్టు సీజ్ అయిన ట్రాక్టర్లు తహసీల్దార్ వద్దకు ఎందుకు రావడం లేదు? రాకుండానే చలానా ఎలా కడుతున్నారు? దీని వెనుక సూత్రదారులెవరు? పాత్రదారులెవరు? అన్నదానిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ముమ్మాటికి ఇది కోర్టు నిబంధనల ఉల్లంఘనే అవుతుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

ఈ ప్రశ్నలకు జవాబులెక్కడ?

నిబంధనల ప్రకారం సీజ్ చేసిన ఇసుక అక్రమ ట్రాక్టర్లను తహసీల్ ఆఫీస్‌కు పోలీసులు అప్పగించాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితులు కావచ్చు? లేదా మారిన చట్టాల కారణంగా కావొచ్చు? రెవెన్యూ కార్యాలయానికి పంపకుండా కోర్టుకు పంపే అధికారం పోలీసులకు ఉండొచ్చు. కానీ, కోర్టు ఆదేశాల ప్రకారం ట్రాక్టర్లను రిలీజ్ చేస్తున్న పోలీసులు, అందులోని ఇసుకను డంప్ చేయడానికి తహసీల్దార్‌కు ఎందుకు అప్పగించడం లేదు? అధికారికంగా వేలం వేయకుండానే వేసినట్టు చూపి ఎలా ₹5వేల చలానా కడుతున్నారు? అసలు అలా కట్టాలని ఎవరు చెబుతున్నారు? ఆ చలానాను తిరిగి కోర్టులో ఎలా సమర్పిస్తున్నారు? ఆ సమయంలో వేలం ద్వారా వచ్చినట్టు చూపుతున్నారా..? లేక ఇంకా ఏమైనా కారణాలు చెబుతున్నారా..? సదరు చలానాను తహసీల్దార్ ఎలా అంగీకరిస్తున్నారు? ఇసుక వేలం వేసి, ప్రభుత్వ ఖాతాలో జమచేసి, సదరు చలానాను కోర్టులో సమర్పించాలని ఆదేశాలుంటే.. ఉల్లంఘన ఎలా జరుగుతున్నది? లోతుగా పరిశీలిస్తే దీని వెనుక పెద్ద తతంగమే జరుగుతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఆదాయం ఎక్కువ తక్కువతో సంబంధం లేకుండా.. వేలం వేయకుండా జరుగుతున్న ఈ బాగోతంపై విచారణ చేస్తే, తప్పుడు పద్ధతులకు పాల్పడుతున్న దెవరు? కోర్టు నిబంధనలను ఉల్లంఘిస్తున్న దెవరు? అనేది బహిర్గతం అవుతున్నది. అంతేకాదు, మరోసారి తప్పు జరుగకుండా ఉంటుంది. ప్రధానంగా పట్టుబడిన ఇసుక తహసీల్ ఆఫీస్ చేరుకుండానే మధ్యలోనే మాయం అవుతున్న తీరులోని లొసుగులు బయటకు వచ్చే అవకాశాముంటుంది. అలాగే అక్రమార్కులు చేస్తున్న దందాకు అడ్డకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి

పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికుల నిరసన

పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 28 : తమ ఉద్యోగాలను వెంటనే పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు శనివారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వారు ఈ నెల 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపగా, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,790 గ్రామ పంచాయతీల్లో 60 వేల మంది సిబ్బంది, కార్మికులు పనిచేస్తున్నారని, చేసిన పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గ్రామ పంచాయతీల్లో భద్రత లేకుండా విధులు నిర్వహిస్తూ ప్రమదాల బారిన పడి మరణిస్తున్నారని, చేతులు, కాళ్ళు, అంగవైకల్యం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీసం ఇన్సూరెన్స్ కూడా లేదని, కనీస వసతులు కల్పించలేని దిక్కుమాలిన స్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే 2025 జనవరిలో నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు ఎండీ ఖాజా, కల్లెపల్లి అశోక్, ఆర్ల సందీప్, జిల్లెల ప్రశాంత్, కార్మికులు పాల్గొన్నారు.

నమ్మించి.. నిండా ముంచి..

ఓ ప్రభుత్వోద్యోగికి ₹కోటి 37 లక్షలకు టోకరా!

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 28 : ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పెడితే భారీగా ప్రాఫిట్ వస్తుందని ఓ ప్రభుత్వోద్యోగిని నమ్మించి.. నిండా ముంచాడో ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్. తనకున్న పాత పరిచయంతో ₹కోటి 37 లక్షలకు టోకరా వేసి మోసగించాడు. ఈ నెల 24న బాధితుడు గోదావరిఖని సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేయగా, ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు, శనివారం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డీఎస్పీ ఎం వెంకటరమణ, ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. రామగుండం ప్రాంతానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ అబ్దుల్ నయీం.. ఓ ప్రభుత్వోద్యోగితో తనకున్న పరిచయాన్ని ఆసరాగా చేసుకున్నాడు. తాను డఫాబెట్ (డీఏఎఫ్ఏబీఈటీ) ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తున్నానని, నీవు కూడా ఇన్వెస్ట్ చేస్తే పెద్ద మొత్తంలో ప్రాఫిట్ వస్తుందని నమ్మించాడు. సదరు ఉద్యోగి నుంచి దఫదఫాలుగా డబ్బులు తీసుకున్నాడు. ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టడంతోపాటు తన అవసరాలకు కూడా వాడుకున్నాడు. అలాగే, షేర్

మార్కెట్‌లో కూడా భారీగా లాభాలు వస్తాయని డబ్బులు తీసుకుని మోసగించాడు. ఇలా మొత్తం ₹కోటి 36 లక్షల 96వేల 290 తీసుకున్నాడు. తర్వాత డబ్బులు ఇవ్వకపోవడంతో సదరు ప్రభుత్వోద్యోగి మోసపోయానని గ్రహించి మంగళవారం గోదావరిఖని సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, శనివారం నిందితుడు అబ్దుల్ నయీంను అరెస్ట్ చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈజీగా డబ్బులు వస్తాయనే ఆశతో ఆన్‌లైన్ గేమ్స్, షేర్ మార్కెట్‌ను నమ్మి మోసపోవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

శిశువును ఎత్తుకున్న కలెక్టర్ పమేలా సత్పతి

శిశువును ఎత్తుకుని లాలించి..

కరీంనగర్ కలెక్టర్ మాతృప్రేమ

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తల్లి ప్రేమను చాటుకున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేసిన ఆమె, అక్కడ ఉన్న ఓ శిశువును ఇలా ఎత్తుకుని లాలించారు. ఎంసీపీ కార్డులో అన్ని వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

- విద్యానగర్, డిసెంబర్ 28

ఐదు నిమిషాల్లో ఇంటికి..
అంతలోనే మృత్యుఒడికి

- బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదం
- రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొని దుర్మరణం
- ఇద్దరూ స్నేహితులు.. ఆ ఇద్దరి భార్యలూ గర్భిణులు
- పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు
- బంజేరుపల్లి లంబాడితండా (బి) గ్రామంలో విషాదఛాయలు

ధర్మారం, డిసెంబర్ 28 : స్నేహితుడి కొడుకును చూసేందుకు వెళ్లి వస్తూ ఆ ఇద్దరు స్నేహితులు అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరారు. ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుతారనేలోపే రోడ్డుపై ఆగి ఉన్న లారీ ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. తండ్రులను కోల్పోయి ఇంటికి పెద్దదిక్కుగా నిలిచిన ఆ ఇద్దరు చనిపోవడం బంజేరుపల్లి లంబాడి తండా (బీ)లో విషాదం నింపింది. గర్భిణులైన ఇద్దరి భార్యలు రోదించిన తీరు తండావాసులను కలిచివేసింది. ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్ వివరాల ప్రకారం.. బంజేరుపల్లి లండాడితండా (బీ)కు చెందిన బానోత్ సంతోష్ నాయక్ (25), నున్సావత్ రాజశేఖర్ (25) ఇద్దరు స్నేహితులు. అదే గ్రామానికి చెందిన మరో స్నేహితుడికి ధర్మారంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో కొడుకు పుట్టగా, చూసేందుకు ఇద్దరు కలిసి శుక్రవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో బైక్‌పై వెళ్లారు. తర్వాత ఇంటికి అవసరమైన సరుకులు కొనుక్కొని, రాత్రి 9.40 గంటలకు తమ తండాకు బయలు దేరారు. పెద్దతండా దాటారు. మరో ఐదు నిమిషాల్లో ఇండ్లకు చేరుకుంటారనేలోగానే.. కరీంనగర్ – రాయపట్నం రహదారిపై వడ్లలోడుతో ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీకొన్నారు. ఎలాంటి ప్రమాద సూచికలు లేకుండా నడిరోడ్డుపై ఆగి ఉన్న లారీని గమనించలేకపోయారు. వేగంగా వచ్చి ఆ వాహనం కింది భాగంలోకి దూసుకెళ్లారు. బైక్ నడుపుతున్న సంతోష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, రాజశేఖర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. ఇద్దరి మృతదేహాలను కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించారు. శనివారం ఎస్ఐ శివ పంచనామా నిర్వహించి, ప్రమాదానికి కారణాలు నమోదు చేసుకున్నారు. రాజశేఖర్ భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మహమ్మద్ ఫారూఖ్ ఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతోష్ నాయక్, రాజశేఖర్ నాయక్ (ఫైల్)

ఇరు కుటుంబాల్లో విషాదం

సంతోష్ నాయక్, రాజశేఖర్ మంచి ఫ్రెండ్స్. సంతోష్ కూలి పని చేస్తున్నాడు. ఆయన తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితమే చనిపోయారు. అతనికి భార్య ప్రత్యూష, రెండేళ్ల కొడుకు ఉన్నాడు. ప్రస్తుతం ప్రత్యూష ఏడు నెలల గర్భిణి. రాజశేఖర్ కరీంనగర్‌లో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి కూడా మరణించాడు. తల్లి నీలమ్మ, భార్య సునీత, రెండేళ్ల కూతురు ఉన్నది. ప్రస్తుతం సునీత ఐదు నెలల గర్భిణి. ఆమె వేములవాడలోని గురుకులంలో ఔట్ సోర్సింగ్‌లో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తుండగా, అక్కడే కుటుంబంతో కలిసి ఉంటున్నది. శుక్రవారం భార్యాభర్తలు ఇద్దరు తండాకు వచ్చారు. సాయంత్రం సంతోష్, రాజశేఖర్ బయటికి వెళ్లి వస్తామని తమ ఇండ్లల్లో చెప్పి అనుకోని రీతిలో చనిపోవడంతో ఇరు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కులను కోల్పోయిన తమకు దిక్కెవరని గుండెలవిసేలా రోదిస్తున్నాయి.

మా టీచర్లే మాకు కావాలి

కోరుట్ల రూరల్: కల్లూరులోని కస్తూర్బా పాఠశాలలో రోదిస్తున్న విద్యార్థిని

- డిప్యూటేషన్ ఉపాధ్యాయులు వద్దు
- మల్యాల, ఇబ్రహీంపట్నం, కల్లూరు కేజీబీవీల్లో విద్యార్థుల నిరసన

కోరుట్ల రూరల్/ ఇబ్రహీంపట్నం/ మల్యాల, డిసెంబర్ 28 : ''మా టీచర్లే మాకు కావాలి.. డిప్యూటేషన్ టీచర్లు వద్దు' అంటూ కస్తూర్బాగాంధీ పాఠశాలల విద్యార్థులు శనివారం నిరసనలు చేపట్టారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు గత కొన్ని రోజులుగా అందులో పాల్గొంటున్నారు. దీంతో విద్యార్థులకు విద్యాబోధన సరిగా జరగడం లేదు. ఈ మేరకు విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను కేటాయిస్తుండడంతో విద్యార్థులు తిరస్కరిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జగిత్యాల జిల్లాలోని కోరుట్ల మండలంలోని కల్లూరు, ఇబ్రహీంపట్నం, మల్యాల మండల కేంద్రాల్లోని కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కోరుట్ల మండలం కల్లూరు కేజీబీవీకి విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కోరుట్ల ఎంఈవో గంగుల నరేశం 10 మంది మహిళా ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపారు. పాఠశాలకు వెళ్లిన వారిని విద్యార్థులు అడ్డుకొని ప్రధాన ద్వారాన్ని మూసివేసి నిరసన తెలిపారు. కొందరు విద్యార్థులు తమకు తమ ఉపాధ్యాయులే కావాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. విద్యార్థులు నిరసనకు దిగడంతో డిప్యూటేషన్‌పై వచ్చిన వారు ఎంఈవోకు సమాచారం అందించారు. దీంతో ఏంఈవో పాఠశాలకు చేరుకొని

మల్యాల: నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

విద్యార్థులకు నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో పాఠశాల వద్ద గందరగోళం నెలకొంది. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థులు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. మల్యాల మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈవో జయసింహారావు పాఠశాల ఆవరణ చేరుకుని విద్యార్థులను సముదాయించారు.

ఇబ్రహీంపట్నం: కస్తూర్బా పాఠశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

కొండచిలువను పట్టుకున్న షేక్ షాహిదా

కొండ చిలువను పట్టేసింది!

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 28: సాధారణంగా మనం పాము పేరు వింటేనే భయపడిపోతాం.. సమీపంలోకి వస్తే పరుగులు పెడుతాం.. కానీ, తీగలగుట్టపల్లికి చెందిన షేక్ షాహిదా మాత్రం అలా కాదు! అది ఎలాంటి పామైనా భయపడకుండా పట్టేస్తుంది. శనివారం తీగలగుట్టపల్లి ఊర చెరువు ప్రాంతంలోని రాజయ్య ఇంటి వద్ద మురుగుకాలువలో కొండచిలువ కనిపించింది. స్థానిక నాయకుడు కాశెట్టి శ్రీనివాస్ సమాచారం అందించడంతో షేక్ షాహిదా అక్కడకు చేరుకొని, ఆ పామును పట్టుకున్నది. తర్వాత అటవీ అధికారులు కొండ చిలువను తీసుకెళ్లి, ఆర్నకొండ అడవిలో వదిలేశారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 28 : ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పెద్దపల్లి డీఈవో మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7వ నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కూడా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13న పరీక్ష ఉంటుందని, 6వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటలకు ఉంటుందని తెలిపారు. వివరాలకు http://telanganams. cgg.gov.in ను సంప్రదించాలని డీఈవో సూచించారు.